క్లుప్తంగా

మలేరియా వ్యాధిపై నిర్లక్ష్యం చేయొద్దు



ల్యాబ్ టెక్నీషియన్‌లకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారులు

ఆదోని అర్బన్: మలేరియా వ్యాధిపై నిర్లక్ష్యం చేయరాదని, ఎప్పటికప్పుడు పరీక్షలు చేసి రిపోర్టు అందజేయాల్సిన బాధ్యత ల్యాబ్ టెక్నీషియన్‌లపై ఉంటుందని జిల్లా మలేరియా అధికారి నూకరాజు సూచించారు. మంగళవారం స్థానిక ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌లకు మలేరియాపై రెండు రోజులు శిక్షణా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి నూకరాజు మాట్లాడుతూ జిల్లాలో మలేరియా తగ్గుముఖం పట్టిందన్నారు. ప్రతి ప్రాంతంలో మలేరియా పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్‌లో వచ్చిన రోగులను నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్, డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి, డివిజన్ మలేరియా అధికారి మంజునాథ్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్‌లు ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త నిరసనలను జయప్రదం చేయండి

ఆదోని రూరల్ : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 14 నుంచి 30వ తేదీ వరకు దేశవ్యాప్తంగా జరిగే నిరసనలను జయప్రదం చేయాలని సీపీఎం, సీపీఐ జిల్లా నాయకులు వెంకటేశులు, అజయ్ తెలిపారు. మంగళవారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ విధానాలను తిప్పి కొట్టాలన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాల్లో ప్రజలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీపీఎం, సీపీఐ పట్టణ కార్యదర్శులు లక్ష్మన్న, సుదర్శన్, నాయకులు బసాపురం గోపాల్, లింగన్న, మహానందరెడ్డి, తిప్పన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కౌతాళం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు ప్రదీప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చూడి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ దేశం మెచ్చిన నాయకుడు డాక్టర్ అంబేడ్కర్ అని, అలాంటి మహానేతను అందరు స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ



ఘర్షణ పడుతున్న దృశ్యం

కోసిగి: మండల కేంద్రంలోని కోసిగి కడపాశెం వీధిలో మారెమ్మ దేవి ఆలయ స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య మంగళవారం ఘర్షణ చోటుచేసుకుంది. మారెమ్మ దేవి ఆలయం పాతికేళ్ల క్రితం శిథిలావస్థకు చేరుకోవడంతో ముందు భాగంలో ఉన్న స్థలంలో ఆలయాన్ని నిర్మించారు. దీంతో పురాతన ఆలయ స్థలం ఖాళీగా ఉండడంతో కొందురు ఆక్రమించేందుకు పునాదుల పనులు చేపట్టారు. గమనించిన మరో వర్గం అడ్డుకోవడంతో మాటామాటా పెరిగి రెండు వర్గాల కర్రలతో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ రాజారెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చి పెద్దల సమక్షంలో సానుకూలంగా పరిష్కరించుకోవాలని సూచించారు. మరోసారి గొడవ పడకూడదని కాలనీ పెద్దల సొంత పూచీకత్తుతో వారిని వదిలిపెట్టారు.

178 మందికి ఈబీసీ నేస్తం

మద్దికెర:మండలంలోని ఆయా గ్రామాలలో 2022 –23 ఆర్థిక సంవత్సరానికి 178 మందికి ఈబీసీ నేస్తం పథకం మంజూరైనట్లు ఎంపీడీఓ నరసింహ మూర్తి మంగళవారం తెలిపారు. ఈ పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు చెప్పారు. బురుజులలో 18, హంప-24, ఎం.అగ్రహారం -36, పెరవలి-48, మద్దికెర-52 చొప్పున సాయం మంజూరైందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం డీబీటీ ద్వారా ఆర్థిక సాయాన్ని లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని వెల్లడించారు.

కుంభాల ఊరేగింపు

ఆస్పరి: మండలంలోని శంకరబండ గ్రామంలో లింగమేశ్వర స్వామి ఉత్సవాల సదర్భంగా మంగళవారం స్వామి వారికి భక్తులు కుంభాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నైవేద్యం సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సర్పంచ్ విజయలక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్

ఆదోని టౌన్: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అన్నారు. పూలే జయంతి వేడుకలను మంగళవారం ఎస్కేడీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలకల్ రేణుక, లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవా, సీనియర్ నాయకులు మురళీరెడ్డితో కలిసి జ్యోతిరావుపూలే చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూణెలోని సతారా జిల్లాలో ఓ మారుమూల గ్రామంలో జ్యోతిరావుపూలే జన్మించారన్నారు. ఆ రోజుల్లో బడుగు, బలహీనవర్గాల కోసం అగ్రవర్ణాలతో నిరంతరం పోరాటాలు చేశారన్నారు. బడుగుల కోసమే ఆయన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. తన భార్య సావిత్రిబాయిపూలేకు విద్యాబుద్ధులు నేర్పించి, ఆమె ద్వారా ఎందరో మహిళలకు చదువు చెప్పించిన మహానుభావుడు జ్యోతిరావుపూలే అన్నారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ వారి ఆశయ సాధనకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఇబ్రహీం, నాయకులు తిమ్మప్ప, రంగస్వామి, సూరి, రామక్రిష్ణ, గంగాధర్, కోదండ, విశ్వనాథరావు, కాశీం, సిద్ధమల్లికార్జున, కిట్టు, హరి తదితరులు పాల్గొన్నారు.

- ఆదోని అర్బన్: స్థానిక బీజేపీ కార్యాలయంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాసులు తదితరులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. సంఘం నాయకులు నాగరాజు, నరసింహులు, వీరచంద్రయాదవ్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.
- పెద్దకడబూరు: బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహాత్మా జ్యోతిరావు పూలేను ప్రతిఒక్కరూ ఆదర్శంగీ తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. పెద్దకడబూరులో పూలే చిత్రపటానికి ప్రదీప్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే అంటరాని తనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేశారన్నారు. ఆయన భార్య సావిత్రిబాయి పూలే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకురాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



కుళాయిలను ప్రారంభిస్తున్న మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: మండల పరిధిలో మూగలదొడ్డి గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పైప్‌లైన్ వేసి తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం సర్పంచ్ శివలింగమ్మ సమక్షంలో రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది భీమేష్ ఆధ్వర్యంలో మురళీ మోహన్ రెడ్డి తాగునీటి కుళాయిలను ప్రారంభించారు. నీటి సమస్య పరిష్కారం కావడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు సోమేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భక్తజనుల మధ్య సాగుతున్న రథోత్సవం

రమణీయం.. రథోత్సవం



పూజలందుకుంటున్న భీమరాయిస్వామి



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో వెలసిన భీమరాయస్వామి రథోత్సవం మంగళవారం రమణీయంగా సాగింది. ఆలయ అర్చకులు నాగరాజుస్వామి తెల్లవారుజామున భీమరాయస్వామి వారికి కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ, గణపతిపూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతులు చేపట్టారు. సాయంత్రం గంగా నాగప్ప తాత ఇంటి నుంచి ఉత్సవ మూర్తిని గుడి వద్దకు తీసుకువచ్చి రథంపై ఆశీనులను గావించారు. అనంతరం గుమ్మడికాయతో రథోత్సవానికి బలి ఇచ్చి ప్రత్యేక పూజలతో రథోత్సవాన్ని ముందుకు కదిలించారు. రథాన్ని బసవన్న కట్ట వద్దకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో బసవేశ్వరుడి రథోత్సవం

ఆదోని రూరల్: మండలంలోని చాగి గ్రామంలో వెలిసిన గూలిబసవేశ్వరస్వామి రథోత్సవాన్ని మంగళవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు, జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. ఉదయం ఉచ్చాయం నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం చేపట్టారు. బుధవారం వసంతోత్సవం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

జగన్ చేతుల్లోనే రాష్ట్ర భవిష్యత్

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
- పాండవగల్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళలకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: రాష్ట్ర అభివృద్ధి జగన్ చేతుల్లోనే ఉందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం సీటు నుంచి గద్దె దించేందుకు ప్రతిపక్ష నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా మరోసారి ప్రజల ఆశీస్సులతో సీఎం అవుతారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నా రు. వేరే ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు ఎత్తివేస్తారని, సంక్షేమ పథకాలు రావాలంటే మరోసారి జగన్‌ను సీఎంగా ఆశీర్వదించాలని ప్రజలను కోరా రు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన పాండవగల్‌లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది పింఛన్ రావ డం లేదని, మధ్యలో పింఛన్ పోయిందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సచివాలయ సిబ్బందిని పిలిచి పొరపాటు ఎక్కడ ఉందో గుర్తించి అర్హులైతే వెంటే పింఛన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను తెచ్చి పాలనను ప్రజల వద్దకు చేర్చారన్నారు. పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షే ఫలాలు అందించిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మ ప్ప, కార్పొరేషన్ డైరెక్టర్లు రేణుక, మంజుల, ఎంపీడీఓ గీతావాణి, ఈఓపీఆర్‌డీ జనార్దన్, పంచాయతీరాజ్ ఏఈ మాలిక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, ఆర్‌ఐ జయరామిరెడ్డి, గ్రామనాయకులు వెంకటేష్, ఉచ్చీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్'

ఆదోని టౌన్/అర్బన్: జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం అట్టహాసంగా కొనసాగుతోంది. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో కౌన్సిలర్లు పద్మ రమేష్‌యాదవ్, చలపతి, ఫయాజ్‌అహ్మద్ పర్యటించారు. ప్రభుత్వ పాలనపై ప్రజలను ఆరా తీశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫొటో ఉన్న స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు.పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. మండలంలోని మండిగిరిలో పార్టీ జిల్లా సెక్రటరీ శేషిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ అర్చక సంఘం అధ్యక్షులు వెల్లుల మధుసూదనశర్మ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్య త్ -మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు.

- మంత్రాలయం రూరల్: యం.తండాలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, తుంగభద్ర, రాంపురం గ్రామాల్లో మండల ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మంత్రాలయంలో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లు అతికించారు.
- కోసిగి: వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి దుద్ది, మూగలదొడ్డి, చిర్తనకల్లు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల మద్దతుతో జగనన్న స్టిక్కర్‌ను ఇంటికి అందించి 8296082960కు మిస్డ్‌కాల్ ఇప్పించారు.
- పెద్దకడబూరు: మండలంలోని హెచ్.మురవణి, కంబలదిన్నె, పెద్దకడబూరు తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిషత్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో ఉరుకుంద ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నాగరాజు గౌడు, పార్టీ యువజన విభాగం నాయకుడు ప్రదీప్ రెడ్డి పర్యటించారు. జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి పాలనపై అభిప్రాయాలు సేకరించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాల అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. నదిచాగి గ్రామంలో ఎంపీటీసీ లింగన్నగౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు షాషా , గణేష్, చక్రధర్, మోక్షిత

ఆదోని అర్బన్: ఒలంపియాడ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని స్టోన్ హిల్ ఇంటర్నేషనల్ పాఠశాల కరస్పాండెంట్ చైతన్య తెలిపారు. మంగళవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈసదర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ జనవరిలో ముంబయిలో జరిగిన ఒలంపియాడ్ పోటీల్లో ఫలితాలు సోమవారం విడుదల అయ్యాయన్నారు. అందులో తమ పాఠశాల విద్యార్థి షాషాకు రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకు, గణేష్ 9వ ర్యాంకు, చక్రధర్ 14వ ర్యాంకు, మోక్షిత 6వ ర్యాంకు సాధించడం పాఠశాలకు గర్వకారణమన్నారు.

మట్టి తొలగింపునకు చర్యలు

పత్తికొండ రూరల్: స్థానిక షాదిఖానా వెనుకభాగంలో కడుగొమ్ము తూముకు పూడ్చిన మట్టిని తొలగించి చదును చేసేందుకు మంగళవారం మైనర్ ఇరిగేషన్ డీఈ చంద్రశేఖర్, ఏఈ వేణుగోపాల్, ఎస్‌ఐ గోపాల్ సమక్షంలో జేసీబీతో పనులు చేపట్టారు. కొద్దిరోజుల క్రితం కడగొమ్మును మట్టితో పూడ్చివేసిన విషయాన్ని స్థానిక ముస్లింలు, రైతులు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆర్డీఓ మోహన్‌దాస్, తహసీల్దారు విష్ణుప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే శ్రీదేవి చెరువు ప్రాంతాన్ని పరిశీలించి కడగొమ్ము పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వాహనాల వేలం

కృష్ణగిరి: వివిధ నేరాల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను వేలం వేయడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. కృష్ణగిరి పోలీస్‌స్టేషన్‌లో సీఐ యుగంధర్, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ద్విచక్ర వాహనాల వేలంపాటలో ఆయన పాల్గొన్నారు. గత రెండేళ్లుగా వివిధ కేసుల్లో పట్టుబడిన ఐదు ద్విచక్ర వాహనాలను వేలంవేయగా జీఎస్టీతో కలిపి రూ.69,527లకు అమ్ముడుపోయినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేయనున్నట్లు వారు తెలియజేశారు.

సారా బట్టీలపై దాడులు



సారాబట్టీలు ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ, పోలీసులు

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్ తండా శివారు కొండ ప్రాంతాలలో నాటుసారా స్థావరాలపై మంగళవారం కోడుమూరు సెబ్, స్థానిక ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పలు స్థావరాల వద్ద నిల్వ ఉంచిన 14 బిందెల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు, బట్టీ నిర్వాహకులెవరన్నది విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'ఈ'-పోస్టాఫీసుతో విస్తృత సేవలు

- కార్పొరేటుకు దీటుగా కార్యకలాపాలు
- ఉత్తమ సేవలకు గుర్తింపు



ఎమ్మిగనూరు పోస్టాఫీసు

ఎమ్మిగనూరు: శాస్త్ర, సాంకేతిక రంగాలతోపాటు బ్యాంకింగ్ రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా పోస్టల్ సేవలు విస్తృతమవుతున్నాయి. 170 ఏళ్ల భారతీయ పోస్టల్ రంగం ప్రస్తావనలో ఉత్తర, ప్రత్యుత్తరాలకే పరిమితం కాకుండా ఆన్‌లైన్, బీమా ప్రీమియం, సేవింగ్స్ బ్యాంక్, నేషనల్ సేవింగ్, ఆర్‌పీఎఫ్, ఎస్‌సీ ఎస్‌ఎస్, కిసాన్ వికాస్ వంటి పథకాలతో ప్రజలకు మరింత చేరువైంది. ఇంటర్నెట్ సేవలు,అంతర్జాతీయ నగదు మార్పిడిని కూడా తపాలా శాఖలో ప్రవేశ పెట్టడటం విశేషం. జిల్లాలో ఎమ్మిగనూరు పోస్టాఫీసు ప్రత్యేక గుర్తింపు సాధించింది. తపాలా శాఖ పరిధిలో రెండు పర్యాయాలు ఉత్తమ పురస్కారాలు, అవార్డులు సొంతం చేసుకుంది.

బ్యాంకులకు దీటుగా..

తపాలా శాఖ ప్రధాన కార్యాలయం ఎమ్మిగనూరులో ఉంది. ఇక్కడ కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా 11 వేల బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. ప్రధాన పోస్టాఫీసుకు అనుబంధంగా 15 సబ్ పోస్టాఫీసులు ఉన్నాయి. నందవరం, గుడేకల్, బనవాసి, తేరుబజారు, నాగలదిన్నె, ముగతి, కడివెళ్ల తదితర గ్రామాల్లో మొత్తం 15 సబ్ పోస్టాఫీసుల్లో విస్తృత సేవలందిస్తున్నాయి. సామాన్య ప్రజలకు సేవలందించటంతోపాటు కార్పొరేట్ రంగానికి సవాల్ విసురుతూ తపాలా సేవలు విస్తరిస్తున్నాయి. ఎమ్మిగనూరు ప్రధాన పోస్టాఫీసులో 2017–18, 2018–19 సంవత్సరాల్లో సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా బాలికలకు అధిక సంఖ్యలో ఖాతాలు తెరిచి భరోసాగా నిలిచింది. ఆదోని రెవెన్యూ డివిజన్ పరిధిలో అత్యుత్తమ సేవలకు గాను రెండు పర్యాయాలు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకుంది.

విస్తృత సేవలు

ఎమ్మిగనూరు మెయిన్ పోస్టాఫీసులో సేవింగ్స్ అకౌంట్లు 4,500, ఆర్‌డీ అకౌంట్లు 4,500, బాలికల కోసం ఎస్‌ఎస్‌ఏ అకౌంట్లు 2000 చొప్పున మొత్తం 11 వేలకు పైగా బ్యాంక్ ఖాతాల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. తపాలా కార్యాలయాల్లో పొదుపు ఖాతా, నెలసరి ఆదాయ పథకం ఖాతాదారులకు ప్రమాద జీవిత బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. అలాగే ఇతరులు బీమా చేయవచ్చు. గ్రామీణ ప్రాంతాల వారికి గ్రామీణ తపాలా జీవిత బీమా సౌకర్యాన్ని ప్రత్యేకంగా కల్పిస్తున్నారు. రూ.లక్ష బీమా చేసిన వారు ఇతర బీమా కంపెనీల కన్నా అధికంగా సంవత్సరానికి రూ.5 వేల బోనస్‌ను పొందవచ్చు. తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలాబీమా, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షబీమా యోజనతో పాటు గతం నుంచి అమలులో ఉన్న బీమా పథకాలను తపాలా శాఖ చేపడుతోంది.

పౌర సేవలు: పౌరుల ఆధార్ నమోదుతోపాటు, తప్పొప్పులు సరిచేసేందుకు ఆధార్ సెంటర్‌ను కూడా పోస్టాఫీసుకు కేటాయించారు. ఎమ్మిగనూరు పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది ఆధార్ సేవలను నిత్యం వినియోగించుకుంటున్నారు. విదేశీ ప్రయాణాలకు అవసరమైన పాస్‌పోర్టు సౌకర్యాలను తపాలా శాఖ నిర్వహిస్తోంది. ఎమ్మిగనూరు బ్రాంచ్‌లో అప్లికేషన్లు అందుబాటులో ఉన్నాయి. సర్వీసులు ఆదోని, కర్నూలు బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నాయి. తిరుమల, తిరుపతి దేవస్థానంకు చెందిన రూ.300 దర్శన టికెట్లను పోస్టాఫీసు ద్వారా బుక్ చేసుకోవచ్చు. అదేవిధంగా పుష్కరాలకు చెందిన తీర్థాలు, పుష్కర జలాలను తపాలాశాఖ ద్వారా పొందవచ్చు.

ఇతర సేవలు

'పికప్ మెయిల్స్ త్రూ పోస్ట్‌మ్యాన్' ద్వారా తపాలా సేవల్లో భాగమైన పోస్టుకార్డులు, కవర్లు, స్టాంపులు వంటి వాటిని పోస్టుమ్యాన్ మన ఇంటి వద్దకే వచ్చి విక్రయిస్తారు. ఏదైనా కార్యాలయం, షోరూమ్ తదితరరాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలు, కరపత్రాలను ఇంటింటికి పంపవలసి వచ్చినప్పుడు పోస్టుమ్యాన్ వీటిని డైరెక్టు పోస్టు ద్వారా చేరవేస్తాడు. ఏవైనా గృహోపకరణాలు, బియ్యం బస్తాలు, ఇతర వస్తువులను మనకు కావాలసిన చోటికి చేరవేసేందుకు తపాలా శాఖ లాజిస్టిక్ పథకాన్ని ప్రారంభించింది. సామానుల ప్యాకింగ్ దగ్గరి నుంచి రవాణా, డెలివరీ వరకూ అన్నీ శాఖ సిబ్బందే బాధ్యత వహిస్తారు. ఈఎంఎస్ స్పీడ్ పోస్టు ద్వారా మనకు చెందిన సమాచారాన్ని లేదా వస్తువులను 104 దేశాల్లోని వారికి పంపే వెసులుబాటు ఉంది.

సేవా సంస్థగా భావిస్తున్నాం

తపాలా శాఖను ఓ సేవా సంస్థగా భావిస్తూ ప్రతి ఉద్యోగి విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ శాఖకు పూర్వ వైభవం తీసుకువచ్చి ప్రతిఒక్కరి అభిమానాన్ని చూరగొనేందుకే 'ఆమ్ ఆద్మీ పోస్టు' అనే కొత్త నినాదంతో 2009లో ఆధునీకరించారు. 2014 నుంచి ప్రత్యేక పథకాలు అమలవుతున్నాయి.

– ఎండీ గోపాల్, ఇన్‌చార్జి పోస్టుమాస్టర్

యాచకుడి డబ్బుపై విచారణ చేస్తాం



అనారోగ్యానికి గురైన యాచకుడు షరీఫ్

హొళగుంద: ఎల్లార్తిలో యాచకుడి డబ్బు విషయంలో తహసీల్దారుతో విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్‌ఐ అబ్దుల్‌జహీర్ అన్నారు. ఎల్లార్తి దర్గాలో దాదాపు 25 ఏళ్లుగా ఉంటున్న షరీఫ్ అనే యాచకుడు వృద్ధాప్య సమస్యతో రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. దర్గాలోని కొందరు అతనికి సపర్యలు చేయగా భిక్షాటన ద్వారా పోగుచేసిన సొమ్ము రూ.2.90 లక్షలను గుర్తించి వాటిని తమ వద్ద పెట్టుకున్నారు. సొమ్ము విషయంపై పుకార్లు వ్యాపించడంతో మంగళవారం ఎస్‌ఐ అబ్దుల్‌జహీర్ వారిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. సొమ్ము భద్రంగా ఉంచాలని సూచించారు. ఘటనపై బుధవారం తహసీల్దారుతో కలిసి విచారణ జరిపి యాచకుడికి డబ్బు చెందేలా చర్యలు తీసుకుంటామన్నారు. తగిన చికిత్స చేయించి అనాథాశ్రమం లేదా బంధువులకు అప్పగిస్తామని ఎస్‌ఐ తెలిపారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.